

ఎర్రబొగుడ శివారులో చిరుత సంచారం

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రబొగుడ శివారులో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు గ్రామానికి చేరుకుని చిరుత సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్న అడుగులను పరిశీలించారు. ఈ ప్రాంతంలో గొర్రెలు, మేకలను, బర్రెలను మేపడానికి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





శివపూజకు వేళాయే

● విద్యుత్ కాంతులీనుతున్న శైవక్షేత్రాలు ● మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబు ● తెల్లవారుజామున నుంచే విశేష పూజలు


కేతకీలో శేషవాహన సేవ ఊరేగింపులో సాంబశివయ్య వేషధారణ

ఝరాసంగం/సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాలోని శైవక్షేత్రాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. మంగళవారం రాత్రి ఆలయాలు విద్యుత్‌దీపాల వెలుగులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. బుధవారం తెల్లవారు జాము నుంచే విశేష అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించనున్నారు. సంగారెడ్డి పట్టణంలోని సంగమేశ్వరాలయం, సోమేశ్వరాలయం, రాజంపేటలోని రాజరాజేశ్వర ఆలయం, మండల పరిధి కల్పగూర్ గ్రామంలోని కాశీ విశ్వేశ్వరాలయం, పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని శివాలయాలలో ఏర్పాట్లు చేశారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలోని పట్టణాల్లో మార్కెట్లకు శివరాత్రి కళ వచ్చింది. పూలు, పూజ సామగ్రి అమ్మకాలతో కిక్కిరిశాయి. సంగారెడ్డి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఝరాసంగం మండలంలోని కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం స్వామి వారి శేష వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల వేదామంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య గ్రామ పుర వీధుల గుండా స్వామి వారిని ఊరేగించారు. మహాశివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పాదయాత్రగా వచ్చే శివభక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లైన్ల ద్వారా దర్శనం కల్పించనున్నారు. తెల్లవారు జామున 4 గంటలకే స్వామి వారి దర్శనలు ప్రారంభమవుతాయని ఈవో శివరుద్రప్ప తెలిపారు. జహీరాబాద్ డీఎస్పీ రామోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నారు.

శివరాత్రి వేడుకలకు ముస్తాబైన సంగారెడ్డి శివాలయాలు

● జగ్గారెడ్డి ఆధ్వర్యంలో లైట్లు, రంగులతో ఆలయాలకు ప్రత్యేక అలంకరణ


సంగారెడ్డిలోని రామ్‌మందిర్ వద్ద ఏర్పాటు చేసి విద్యుత్ లైట్లను పరిశీలిస్తున్న జగ్గారెడ్డి


రంగులతో ముస్తాబైన సంగారెడ్డి పట్టణంలోని సంగమేశ్వర ఆలయం


సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : శివరాత్రి వేడుకలకు సంగారెడ్డి పట్టణంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శివాలయాలకు లైట్లు, రంగుల వేశారు. జగ్గారెడ్డి ప్రత్యేక చొరవతో నాలుగు రోజులుగా దగ్గరుండి సంగారెడ్డిలోని పాత బస్టాండ్ సమీపంలోని సంగమేశ్వర ఆలయాన్ని మరమ్మతులు చేయించి, పూర్తిస్థాయిలో రంగులు వేయించారు. పట్టణ ప్రధాన దారులతో పాటు ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శివరాత్రి వేడుకల కోసం నేటి రాత్రి సంగీత విభావరి నిర్వహించనుండగా, గంజిమైదాన్‌లో ఏర్పాట్లు చేశారు. ప్రముఖ గాయకులు మనో, ఎస్పీ శైలజ తదితరులు విచ్చేయనున్నారు. ఏర్పాట్లను జగ్గారెడ్డి పర్యవేక్షించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, మహేశ్ముదిరాజ్, కిరణ్‌గౌడ్, కిరణ్‌గౌడ్, రఘుగౌడ్, సుధాకర్, శ్రీహరి తదితరులు ఉన్నారు.

అమ్మా బైలెల్లినావమో

మహాజాతరకు ఏడుపాయల ముస్తాబు

పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి దామోదర్

పాపన్నపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సర్పయాగ స్థలిలో వెలసిన ఏడుపాయల వనదుర్గామాత మహాజాతరకు వేళైంది. మెదక్ జిల్లా పాపన్నపపేట నాగ్‌సాన్‌పల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మంజీరా నది ఏడు పాయలుగా చీలిన ప్రదేశంలోని కొండగుహల్లో వనదుర్గామాత వెలిసింది. ప్రతి ఏటా శివరాత్రి పర్వదినం నుంచి జాతరను నిర్వహించనున్నారు. బుధవారం ఉపవాస దీక్షలతో ప్రారంభమయ్యే జాతర.. రథోత్సవంతో ముగియనున్నది. శివసత్తుల శివాలు, పోతురాజుల విన్యాసాలు, బోనాల ఊరేగింపులు, డప్పుచప్పుళ్లు, కళాకారులు ఆటాపాటలతో మార్మోగనున్నది. జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. మంగళవారం రాత్రి నుంచి ముల్లెమూటతో భక్తుల ఏడుపాయల సన్నిధికి చేరుకుంటున్నారు. నేడు దుర్గామాత సన్నిధిలో ఉపవాస దీక్షలు చేపడతారు. గురువారం బండ్ల ఊరేగింపు, శుక్రవారం రాత్రి రథోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నేడు జాతర ప్రారంభోత్సవానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ విచ్చేయనున్నారు. అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పిస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 883 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నారు.



ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా జాతర

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఏడుపాయల వనదుర్గమ్మ జాతర ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి మంగళవారం ఆయన జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఎక్కడ ఎలాంటి లోపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏడుపాయలకు ఆర్టీసీ సర్వీసులు ఎక్కువగా నడపాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారుల నోడల్ ఆఫీసర్ల సమన్వయంతో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, భక్తుల కోసం ఎక్కడికక్కడ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. 150 మంది గజ ఈతగాళ్లు, రెండు అగ్నిమాపక వాహనాలు, ఒక వైద్యశాల, 10 వైద్యశిబిరాలు, 4 అంబులెన్స్‌లు, 251 మంది వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ 400 ప్రత్యేక బస్సులను నడుపుతున్నదని వివరించారు. టేకుల గడ్డ బస్టాండ్ నుంచి 10 ఉచిత మినీ బస్సుల ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రూ.2 కోట్ల మంజూరు

● మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్, అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గామాత జాతర నిర్వహణకు ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) నుంచి రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మంగళవారం ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. భక్తులకు మౌలిక వసతుల కల్పనకు నిధులివ్వాలని విజ్ఞప్తి చేయగా వెంటనే స్పందించి మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

పాటల సీడీ ఆవిష్కరణ

మెదక్ అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షుడు, రచయిత హర్కార్ మహిపాల్ రచించిన ఏడుపాయల వనదుర్గామాత జాతర పాటల సీడీని మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి ఆవిష్కరించారు. మహిపాల్ రాసిన 'అమ్మ మనం పోదామే ఏడుపాయల జాతరకు' పాటను ప్రముఖ గాయకుడు జడల రమేష్‌తో సంగీతం అందించి పాడారు.

సాగులో సాంకేతికత

డ్రోన్లతో మందుల పిచికారీ

యాప్‌లతో వ్యవసాయం

యువ రైతుల ప్రయోగాలు

పెరుగుతున్న దిగుబడులు

తగ్గుతున్న పెట్టుబడులు

5

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

మృతుల్లో తల్లీకొడుకు, కోడలు 5

సంగారెడ్డి జిల్లా బుదేరా చౌరస్తాలో ఘటన

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల ర్యాండమైజేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా భద్రత ఏర్పాట్లు చేపట్టామని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న పాఠశాలలు, కళాశాలలకు ఈ నెల 26, 27న సెలవు ప్రకటించినట్టు కలెక్టర్ క్రాంతి తెలిపారు.

నువ్వానేనా అంటూ హోరాహోరీగా సాగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగిసింది. రేపు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఇటు పట్టభద్రులు, అటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీల గెలుపోటములను ప్రభావితం చేసే విషయంలో మెతుకుసీమ కీలకంగా మారింది. రెండు ఎమ్మెల్సీలకు సంబంధించి గడిచిన ఎన్నికలతో పోల్చితే ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓట్ల సంఖ్య గణనీయంగా పెరగడమే అందుకు కారణం.

ఉమ్మడి జిల్లాలో 70,713 మంది పట్టభద్రులు


అత్యధికంగా ఉపాధ్యాయులు 7,249 మంది మనోళ్లే

ఇక్కడివారి ఓట్లతోనే గెలుపోటముల ప్రభావం

విస్తృతంగా కాంగ్రెస్, బీజేపీ ప్రచారం

ధీటుగా బీఎస్పీ, స్వతంత్ర, సంఘాల అభ్యర్థులు

ముగిసిన ఎన్నికల ప్రచారం.. రేపు పోలింగ్



మెదక్-కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రుల ఓట్లు

మొత్తం	3,55,159
పురుషులు	2,26,765
మహిళలు	1,28,392

నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓట్లు

మొత్తం	27,088
పురుషులు	16,932
మహిళలు	10,156

ఎమ్మెల్సీ ఓటు ఇలా వేద్దాం 5

'ఎంసీహెచ్'లోకి గేట్ పాస్ ఉంటేనే అనుమతి

● అమలుకు జీజీహెచ్ అధికారుల చర్యలు


గేట్ పాస్ చూపిస్తున్న సహాయకురాలు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ప్రాంగణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో రద్దీని నియంత్రించడంతో పాటు ఎవరు పడితే వారు ప్రవేశించకుండా గేట్ పాస్‌ల జారీకి అధికారులు శ్రీకారం చుట్టారు. పేషెంట్ వెంట ఒక అంటెండెంట్(సహాయకుడు) మాత్రమే ఉండాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని మంగళవారం నుంచి అమలులోకి తీసుకొచ్చారు. ప్రసవం కోసం గర్భిణులు, చికిత్స నిమిత్తం చిన్నారులతో మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోకి వచ్చే వారికి అడ్మిషన్ రిజిస్ట్రేషన్ చేసి కేస్ షీట్‌తో పాటు ఇన్‌పేషెంట్ గేట్ పాస్‌ను జారీ చేస్తారు. పేషెంట్ వెంట వచ్చే సహాయకులు లోపలికి, వెలుపలికి వెళ్లే క్రమంలో ప్రవేశ ద్వారం వద్ద ఉండే సెక్యూరిటీకి పాస్ చూపిస్తేనే అనుమతిస్తారు. లేకపోతే అనుమతి నిరాకరిస్తారు.

మెతుకుసీమ కీలకం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 25 : మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల ప్రక్రియ తుదిదశకు చేరింది. మంగళవారం సాయంత్రం అభ్యర్థుల ప్రచారం ముగిసింది. నేడు ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉండడంతో ఈ కాస్త సమయాన్ని కూడా అభ్యర్థులు సద్వినియోగం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఫోన్‌కాల్స్, వాయిస్ కాల్స్, మెసేజ్‌ల ద్వారా ప్రతీ ఓటరును అభ్యర్థిస్తున్నారు. బరిలో 56 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు, 15 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు ఉండడంతో దాదాపు అందరి నుంచి అభ్యర్థనలు వస్తున్నాయి.

పట్టభద్రుల్లో పోటాపోటీ

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు 70వేల పైచిలుకు ఉండడంతో అభ్యర్థులు ఈ దిశగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు తదితరులు పలుచోట్ల సభలు, సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ ఓట్లపై నరేందర్‌రెడ్డి, బీజేపీ పార్టీపై అంజిరెడ్డి విశ్వాసం పెట్టుకున్నారు. ఇక బీసీ, బడుగు బలహీన వర్గాల ఓట్లతోపాటు నిరుద్యోగుల ఓట్లు తనకు కలిసి వస్తాయని ప్రసన్న హరికృష్ణ భావిస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి బరిలో ఉన్నందున తనను గుర్తించాలని కోరుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు, టీచర్ల హక్కుల కోసం పోరాడుతున్న ట్రస్మా నేత యాదగిరి శేఖర్‌రావు సైతం దీటైన పోటీ ఇస్తున్నారు. కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్ సైతం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కరీంనగర్ జిల్లాతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓట్లు సాధించిన వారికే విజయావకాశాలు ఎక్కువగా

గ్రాడ్యుయేట్ ఓట్ల వివరాలు

జిల్లా	కేంద్రాలు	మహిళలు	పురుషులు	మొత్తం
సంగారెడ్డి	40	8269	17,383	25652
మెదక్	22	3593	8879	12472
సిద్దిపేట	40	11002	21587	32589

టీచర్స్ ఓట్ల వివరాలు

జిల్లా	కేంద్రాలు	మహిళలు	పురుషులు	మొత్తం
సంగారెడ్డి	28	1170	1520	2690
మెదక్	21	548	799	1347
సిద్దిపేట	23	1192	2020	3212

మిగతా 5వ పేజీలో

మహాశివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

సంగారెడ్డి రూరల్/మనోహరాబాద్/శివ్వంపేట/చిలప్‌చెడ్/హవేళిఘణపూర్/పుల్‌కల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలోని శైవక్షేత్రాలు వివిధ రంగులు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబయ్యాయి. సంగారెడ్డి పట్టణంలోని సంగమేశ్వరాలయం, సోమేశ్వరాలయం, రాజంపేటలోని రాజరాజేశ్వర ఆలయం, మండలంలోని కల్పగూర్ గ్రామంలోని కాశీ విశ్వేశ్వరాలయం, పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని శివాలయాల్లో శివరాత్రి వేడుకలకు సిద్ధమయ్యాయి. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్ గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి, శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు పురాతన గణపతి సమేత సోమేశ్వరాలయం, పెద్దగొట్టిముక్లలోని ఉమా సంగమేశ్వరాలయం, శివ్వంపేటలోని శివాలయం, ఉమామహేశ్వర ఆలయం, చిలప్‌చెడ్ మండలంలోని చండూరు రామలింగేశ్వరస్వామి ఆలయం, హవేళిఘణపూర్ మండలం ముత్తాయికోటలోని సిద్ధేశ్వరాలయం, ఉమ్మడి పుల్కల్ మండలంలోని శివంపేట, మిన్‌పూర్, గొంగ్లూరు, పుల్కల్‌లో భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాలు, కోర్పోలులోని శ్రీమహాదేవాలయం, చౌటకూర్‌లోని అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరాలయం, కోడూరులోని ఉమానాగలింగేశ్వరాలయం, ముదిమాణిక్యంలోని భోగేశ్వరాలయం,పెద్దారెడ్డిపేట, సింగూరు గ్రామాల్లోని శైవాలయాలను సిద్ధం చేశారు.


వివిధ రంగులతో ముస్తాబవుతున్న సంగారెడ్డి పట్టణంలోని సంగమేశ్వరాలయం

రెట్టింపైన పండ్ల ధరలు

సంగారెడ్డి రూరల్/తూప్రాన్/రామాయంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పండ్ల రేట్లు రెట్టింపయ్యాయి. గతంలో కిలో పుచ్చపండు రూ.15 ఉండగా.. ప్రస్తుతం రూ.20కి విక్రయిస్తున్నారు. ఆపిల్ రూ.100కు ఐదుఇవ్వగా.. ప్రస్తుతం రూ.100కు మూడు నుంచి నాలుగు ఇస్తున్నారు. అరటి పండ్లు డజన్(12)కు రూ.40 ఉండగా.. ప్రస్తుతం డజన్ రూ.100, సపోట కిలో రూ.80, ద్రాక్ష కిలో రూ.100, సంత్ర రూ.100లకు (5), రత్నపురి (కంద) గడ్డ రూ.40లకు కిలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉపవాస దీక్ష పండ్లతోనే విరమించేది కాబట్టి ధరలు అధికంగా ఉన్నా కొనుగోలు చేస్తున్నామని వినియోగదారులు తెలిపారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని రామాయంపేటలో వందకు పైగా పండ్ల దుకాణాలు వెలిశాయి. మంగళవారం సాయంత్రం దుకాణాలు జనంతో కిటకిటలాడాయి.

బ్యూవరైజ్ ట్యాంక్‌ను ఢీకొని కార్మికుడి మృతి



ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్థులు, ప్రజాసంఘాల, పార్టీల నాయకులు, రాములు(ఫైల్)

కొండాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమ లోపల బ్యూవరైజ్ ట్యాంకు అద్దాలకు ప్రమాదవశాత్తు బైక్‌తో ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ వివరాల ప్రకారం.. మారేపల్లి గ్రామానికి చెందిన ఉత్తర్‌పల్లి రాములు(30) మల్లేపల్లి శివారులోని యూబీ బీరు పరిశ్రమల్లో 6న కార్మికుడి విధుల్లో చేరాడు. మంగళవారం ఉదయం 5:30 గంటలకు ఇంటి నుంచి బయలుదేరాడు. పరిశ్రమ ఎదుట ఉన్న పార్కింగ్‌లో బైక్‌ను నిలపకుండా, మెయిన్ గేట్‌లో విధుల రిజిస్ట్రర్‌లో పేరును నమోదు చేయకుండా నేరుగా పరిశ్రమలో పల బ్యూవరైజ్ ట్యాంక్‌ను బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం పరిశ్రమ యాజమాన్యం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు తెలిపారు.

పరిశ్రమ ఎదుట ఆందోళన

రాములు మృతి విషయాన్ని తమకు చెప్పకుండా ఆస్పత్రికి తరలించడంపై సెక్యూరిటీ, యాజమాన్యంపై అనుమానాలను వ్యక్తం చేస్తూ.. కుటుంబసభ్యులు, గ్రామస్థులు, ప్రజా సంఘాల, వివిధ పార్టీల నాయకులు గేట్ ఎదుట ఆందోళనకు దదిగారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేషం కలుగజేసుకొని పరిశ్రమ, యూనియన్ సభ్యులు, దాతల సహాయంతో మృతుని కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో పాటు మృతుడి పిల్లల చదువు, కుటుంబసభ్యులకు ఉద్యోగం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో మాజీ ఎంపీపీలు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, మనోజ్‌రెడ్డి, మాజీ సర్పంచులు పాండురంగం, వెంకటేశంగౌడ్ పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్‌లో పడి ఒకరు..

కొండాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : వాటర్ ట్యాంక్‌లో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కొండాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ వివరాల ప్రకారం.. గుంతపల్లి గ్రామానికి చెందిన మల్లేపల్లి మల్లేశం సోమవారం రాత్రి గ్రామంలో సరఫరా చేసే నీటి ట్యాంక్‌లో నీళ్లు నిండాయో.. లేదో చూసేందుకు పైకి ఎక్కాడు. నిచ్చెన సహాయంతో లోపలికి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు నిచ్చెన జారి నీటిలో మునిగి చనిపోయాడు. మృతుని భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

వెల్దుర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అందుగులపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అక్కమొల్ల గణేష్(40) సోమవారం ఉదయం 11 గంటలకు పొలం వద్ద నీరు పార పెట్టడానికి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా మంగళవారం ఉదయం పొలం, చెరువు కట్ట వద్ద వెతుకుతుండగా చెరువులో ఉన్న సంపులో శవమై కనిపించాడు. గణేష్ కాళ్లకు, చేతులకు చేపల వల చుట్టుకుని ఉన్నది. గణేష్ మృతిపై అనుమానం ఉందని భార్య మహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పాపన్నపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : చిన్నపాటి పారుదల ప్రాజెక్టులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఘనపూర్ ఆనకట్ట నీటిలో గుర్తు తెలియని యువకుడి(30) మృతదేహం ఉన్నదని స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారమందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకుతీసి, మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి గురించి తెలిస్తే పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ నంబరులో 8712657930కు సంప్రదించాలని కోరారు.

ఔటర్‌రింగ్ రోడ్డుపై పోలీసు వాహనం బోల్తా

● సైబరాబాద్ పోలీసు సిబ్బందికి గాయాలు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పట్టణ శివారులో ఔటర్ రింగ్ రోడ్డు ముత్తంగి ఎగ్జిట్ వద్ద పోలీసు వాహనం బోల్తా కొట్టిన ఘటన మంగళవారంచోటు చేసుకుంది. పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రెడ్డి వివరాల ప్రకారం.. కంది జిల్లా జైలులోని ఓ ఖైదీని అదుపులోకి తీసుకునేందుకు సైబరాబాద్ కమిషనరేట్ పోలీసులు వాహనంలో బయలుదేరారు. వాహనంలో ఐదుగురు కానిస్టేబుళ్లు, డ్రైవర్ ఉన్నారు. ముత్తంగి జంక్షన్ సమీపంలోకి రాగానే వాహనం టైర్ పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఘనటలో వాహనంలోని నలుగురు కానిస్టేబుళ్లు, డ్రైవర్ గాయపడ్డారు. సిబ్బందిని హుటాహుటిన అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదస్థాయి తీవ్రంగా ఉన్నప్పటికీ సిబ్బందికి ప్రాణాపాయం తప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రెడ్డి పేర్కొన్నారు.


బోల్తాపడ్డ పోలీస్ వాహనం

రేషన్ బియ్యం పట్టివేత

వెల్దుర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వెల్దుర్తికి చెందిన కైలాష్ శ్రీనివాస్ అనే వ్యాపారి తన ఇంట్లో 1.8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేశాడు. సమాచారమందుకున్న పోలీసులు బస్తాలను సీజ్‌చేసి, సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్ సాయికుమార్‌కు, సిబ్బందికి అప్పగించారు. సీజ్‌చేసిన బియ్యాన్ని ఆటోలో సివిల్ సప్లయ్ గోదాముకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ తెలిపారు.


సిద్దిపేటలో పూజలు చేస్తున్న మహిళలు


సిద్దిపేట మార్కెట్‌లో సందడి



సంగారెడ్డిలోని వీరభద్రేశ్వరాలయం


హుస్నాబాద్‌లో..



శివోహం..

మహాశివరాత్రిని పురస్కరించుకుని శివాలయాలు రంగురంగుల విద్యుత్ దీపాల్లో వెలిగిపోయాయి. కొన్ని చోట్ల మంగళవారం రాత్రి నుంచే సందడి నెలకొంది. మార్కెట్లు కిటకిటలాడాయి.




జహీరాబాద్‌లో..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

మృతుల్లో తల్లీకొడుకు, కోడలు


రోడ్డు ప్రమాదంలో చెల్లాచెదురైన మృతదేహాలు

మునిపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి బుదేరా చౌరస్తాలో మంగళవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఒకే బైక్‌పై వెళ్తున్న ఈ ముగ్గురిని గుర్తు తెలియని వాహనం ఢీ కొందా? లేక వేగంగా వెళ్తూ డివైడర్‌ను ఢీ కొని మృతి చెందారా అన్నది తేలడం లేదు. మునిపల్లి ఎస్సై రాజేశ్‌నాయక్ కథనం ప్రకారం.. మండలంలోని అంతారం గ్రామానికి చెందిన పి. రవి(33), అతని తల్లి పి. లక్ష్మి(53), భార్య శోభారాణి(28)లు పని నిమిత్తం సదాశివపేటకు మంగళవారం రాత్రి ఒకే బైక్‌పై బయలుదేరారు. వీరి వాహనం బుదేరా చౌరస్తా వద్దకు రాగానే ప్రమాదం జరిగి ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. ముగ్గురి మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. రాత్రి వేళ ప్రమాదం జరగడంతో అది ఎలా జరిగిందో ఎవరూ చూడలేదు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు పరిశీలిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెబుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రవికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకే ప్రమాదంలో తల్లీకొడుకు, కోడలు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సదాశివపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెరువులో పడి ఇద్దరి దుర్మరణం


సునీల్‌గౌడ్, ప్రవీణ్ (ఫైల్)

నర్సాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ రాయరావు చెరువులో పడి ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఎస్సై లింగం కథనం ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన దుర్గప్పగారి సునీల్‌గౌడ్ (31), సార ప్రవీణ్(31) సోమవారం మధ్యాహ్నం ప్రవీణ్ బైక్‌పై తమ తమ ఇళ్ల నుంచి వెళ్లారు. సాయంత్రం వరకు కూడా ఇంటికి రాలేదు. వారి ఫోన్లు కూడా పని చేయకపోవడంతో కుటుంబీకులు అంతటా వెతికారు. మంగళవారం ఉదయం తప్పిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయంత్రం చెరువులో రెండు మృతదేహాలు తేలి ఉన్న విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వెళ్లి పరిశీలించి, సునీల్ గౌడ్, ప్రవీణ్‌లుగా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలు బయటపడ్డ ప్రాంతంలో చెరువు అలుగు వద్ద మద్యం సీసాలు ఉండటంతో మద్యం తాగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో ప్రవీణ్‌కు వివాహం అయి, ఐదేళ్ల కుమారుడు ఉండగా, సునీల్‌కు ఇంకా వివాహం కాలేదు. ప్రవీణ్ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. సునీల్‌గౌడ్ కులవృత్తి చేస్తున్నాడు.

కూడవెల్లి వాగులో పడి మరొకరు..

మర్కుక్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూడవెల్లి వాగులో కాలుజారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నరసన్నపేట గ్రామ శివారులో జరిగింది. ఎస్సై దామోదర్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన బొంత అంజయ్య(43) కొన్ని రోజుల క్రితం ఎలక్ట్రిక్ పోల్స్‌కి గుంతలు తీసేందుకు గ్రామానికి కూతురు భారతి కుమారుడు ఉదయ్‌తో కలిసి వచ్చారు. కూడవెల్లి వాగు వద్దకు మూత్ర విసర్జన చేసేందుకు వెళ్లి కాలు జారి అందులో పడి, చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్ సర్వీసెస్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపిక



కంది, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఆటల పోటీలకు కంది మండలం ఇంద్రకరణ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎన్.రమేశ్ ఎంపికయ్యారు. ఇటీవల హరియాణాలోని చండీగడ్‌లో జరిగిన ఈ ఆటల పోటీల్లో 10 కిలోమీటర్ల పరుగు పందెంలో రమేశ్ ఫస్ట్ వచ్చారు. రెండు రోజుల క్రితం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అక్కడి రాజ్‌భవన్‌లో రమేశ్‌ను అభినందించారు. మంగళవారం సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.



- ● డ్రోన్లతో మందుల పిచికారి
- ● యాప్‌లతో వ్యవసాయం
- ● యువ రైతుల ప్రయోగాలు
- ● పెరుగుతున్న దిగుబడులు
- ● తగ్గుతున్న పెట్టుబడులు

సాగులో.. సాంకేతికత

రామాయంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన యువ రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, సాంకేతికతను వినియోగించి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఇందు కోసం డ్రోన్లను, యాప్‌లను, ఇతర పరికరాలను వినియోగించడంతో పాటు తోటి రైతులకూ సాయం చేస్తున్నారు. రామాయంపేటలో శిక్షణ పొందిన డ్రోన్ పైలెట్లు పంటలకు పురుగు, తెగులు మందులను పిచికారి చేస్తున్నారు. మూడు వారాల క్రితమే సుమారు రూ. 20 లక్షల విలువైన డ్రోన్‌ను స్థానిక ప్రాథమిక సహకార సంఘానికి అందజేశారు. ఈ పరికరం సహాయంతో సుమారు వంద ఎకరాల్లో పురుగుల మందు చల్లే ప్రక్రియను చేపట్టారు.

వ్యవసాయం భారంగా మారి.. కాడి కింద పడేస్తున్న కాలంలో యువ రైతులు సాగును సాంకేతికతో ముడిపెడుతున్నారు. ఇప్పటికే ఎన్నో పరికరాలతో వ్యవ'సాయం' చేస్తుండగా, ఇప్పుడు డ్రోన్ల లాంటి అత్యాధునిక పరికరాలను వినియోగిస్తున్నారు. సాగులో యాప్‌ల సాయం తీసుకుంటున్నారు. దీంతో పెట్టుబడులు తగ్గుతుండగా, దిగుబడులు పెరుగుతున్నాయి.

యాప్‌ల సాయమూ..

వ్యవసాయంలో యువత డిజిటల్ మాధ్యమాలనూ వినియోగిస్తోంది. స్మార్ట్‌ఫోన్లలో పంటల సాగు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని, శాస్త్రజ్ఞుల సలహాలను తీసుకుంటూ వ్యవసాయం చేస్తున్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా శాస్త్రజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకుంటూ తాము పాటించడమే కాకుండా పొరుగు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గతేడాది ప్రభుత్వం ఇజ్రాయిల్ దేశంలో సాగు విధానాన్ని అధ్యయనం చేయడానికి ఓ బృందాన్ని పంపగా, అందులో రామాయంపేట వ్యవసాయ సాహాయ సంచాలకులు రాజ్ నారాయణ సైతం ఉన్నారు. అక్కడ తెలుసుకున్న విషయాలను ఆయన ఇక్కడ రైతులకు సూచిస్తున్నారు. దీంతో రైతుకు శ్రమ, సమయం కలిసి రావడంతో పాటు కూలీల సమస్య తీరింది. పంట పెట్టుబడులూ తగ్గి, దిగుబడులు పెరిగాయి.


రామాయంపేటలో ఖర్జూర పండ్ల పంట

యువ రైతులే కీలకం



యువ రైతులు వ్యవసాయంలో ఆసక్తి కనబరుస్తున్నారు. మేమూ మునుపటిలా కాక నేటి అవసరాలకు అనుగుణంగా వివిధ పంటల సాగు మెలకువల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. రైతు నేస్తం, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సాగు పద్ధతులపై సందేహాలు నివృత్తి చేస్తున్నాం.

- రాజ్ నారాయణ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు

డిగ్రీ చేసి వ్యవసాయం వైపు..



డిగ్రీ పూర్తి చేసి కొత్త టెక్నాలజీతో పంట సాగుపై దృష్టి సారించా. దీనిలో భాగంగా ఢిల్లీకి వెళ్లి డ్రోన్ పైలట్ శిక్షణ తీసుకున్నా. నేను వ్యవసాయం చేసుకుంటూనే ఇతర రైతులకు డ్రోన్ ద్వారా తెగులు, పురుగుల మందు పిచికారి చేస్తున్నా. - శ్రీకాంత్, డ్రోన్ పైలట్

ఖర్జూర తోటలు

ఇంతకాలం జిల్లాలో వరి, మొక్కజొన్న తదితర పంటలు పండించిన పంటలు ఖర్జూర లాంటి పండ్ల తోటలనూ పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు. రామాయంపేటకు చెందిన సత్యనారాయణ అనే రైతు అర ఎకరంలో ఖర్జూర పండ్ల తోటను సాగు చేస్తున్నారు. మరికొందరు రైతుల అరటి సాగు చేస్తున్నారు.

బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు

అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడంలేదు

ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్


మెదక్‌లో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్, పక్కన మైనంపల్లి

మెదక్/నర్సాపూర్/చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను పోటీలో నిలుపకుండా బీజేపీకి మద్దతుగా లోపాయికారిగా పనిచేస్తోందని అఖిల భారత కాంగ్రెస్ కార్యదర్శి విశ్వనాథ్ విమర్శించారు. మంగళవారం మెదక్‌లోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అతిథి గృహంలో, నర్సాపూర్‌లోని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో, చిన్నశంకరంపేటలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. ఆరు గ్యారెంటీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ గత ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చుతున్నామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేయని అభివృద్ధి కేవలం 14 నెలల కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసి చూపారన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు లాంటి దిగ్గజాల ప్రాతినిధ్యం వహించిన ప్రాంతం ఉన్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అభ్యర్థి దొరకలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే 50వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే రికార్డు సృష్టించారన్నారు. పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు రోహిత్‌రావు, మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లిహన్మంతరావు, మెదక్ పార్లమెంటు ఇన్‌చార్జి నీలం మధు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి , నాయకులు తొడుపునూరి చంద్రపాల్, అరుణార్తి వెంకటరమణ, బొజ్జపవన్ శర్మ, ఉప్పల రాజేష్, లింగం, లక్ష్మీనారాయణగౌడ్, మహిపాల్‌రెడ్డి, మేడి మధుసూదన్‌రావు, శివరామకృష్ణ బూర్ల సచిన్, ఆంజనేయులు గౌడ్, గూడూరి కృష్ణ, కొండన్ సురేందర్‌గౌడ్, శ్రీనివాస్ చౌదరి పట్టభద్రులు పాల్గొన్నారు.

జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో సీఎం సోదరుడి పూజలు



సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన 1.08 కోటి రుద్రాక్షల శివలింగానికి సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి కొండల్‌రెడ్డికి శివలింగం తయారీ విధానం, ఆలయ నిర్మాణ విశేషాలను వివరించారు. అనంతరం కొండల్‌రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు.

నేరడిగుంటకు పీహెచ్‌సీ మంజూరు

జోగిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మంత్రి దామోదర చొరవతో అందోలు మండలం నేరడిగుంటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కానున్నది. గత నెలలో దామోదర నేరడిగుంటను సందర్శించగా, అక్కడి ప్రజలు తమ గ్రామంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని కోరారు. వారి కోరిక మేరకు పీహెచ్‌సీని ఏర్పాటుచేస్తానని మంత్రి మాటిచ్చారు. మంత్రి సూచన మేరకు కేవలం 25 రోజుల్లోనే ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రి చొరవతో రూ. 2.45 కోట్లు కూడా విడుదలయ్యాయి. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టినా చోంగ్తు జీఓ నెంబర్ 66 జారీ చేశారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌ను బహిష్కరించిన

డంప్‌యార్డ్ బాధితులు

జిన్నారం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంప్‌యార్డ్‌ను నిరసిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. డంప్‌యార్డ్‌కు వ్యతిరేకంగా గుమ్మడిదల, కొత్తపల్లికి చెందిన వారు జేఏసీగా ఏర్పడి 21 రోజులుగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం జేఏసీ నాయకులు సమావేశమై ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించాలని తీర్మానించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించి, దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, రైతులు, మహిళలు, విద్యార్థి నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మెతుకుసీమ కీలకం

3వ పేజీ తరువాయి

ఉండడంతో అందరి దృష్టి మెతుకుసీమపై పడింది. గత ఎన్నికల్లో 30వేల పైచిలుకు మాత్రమే పట్టభద్రుల ఓట్లు ఉన్నాయి. ఆ సంఖ్య రెట్టింపును మించడంతో ఇక్కడి పట్టభద్రుల తీర్పు కీలకంగా మారింది.

ఉపాధ్యాయుల ఓటెవరికో?

నాలుగు ఉమ్మడి జిల్లాల్లో కలిపి 27వేల ఉపాధ్యాయుల ఓట్లు ఉండగా అందులో 7,289 ఓట్లు ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించినవే ఉన్నాయి. ఇందులో సిద్దిపేట జిల్లాలోనే 3,212 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. గతంలో పీఆర్‌టీయూ తరఫున పోటీచేసి గెలిచిన రఘోత్తమరెడ్డి సిద్దిపేట వాసే. ఈసారి పీఆర్‌టీయూ సంఘం రఘోత్తమరెడ్డిని పక్కనబెట్టి వంగ మహేందర్‌రెడ్డికి అవకాశం కల్పించింది. ఇతర సంఘాలు, ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘాల మద్దతు కూడగట్టుకున్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా ఓటర్ల నమోదులో ఐదు నెలల నుంచే కీలకంగా ఉండడం తనకు కలిసి వస్తుందని, పెద్ద సంఘం కావడంతోపాటు అందరూ ఏకతాటిపై ఉన్నారని ఆయన ధీమాతో ఉన్నారు. అదే విధంగా బీజేపీతోపాటు అనుబంధ, ఇతర సంఘాల మద్దతుతో తానే విజయం సాధిస్తానని ఆ పార్టీ అభ్యర్థి మల్క కొమురయ్య భావిస్తున్నారు. టీపీటీఎఫ్ సంఘంలో కీలక నేత అయిన వై.అశోక్‌కుమార్ సైతం పలు జేఏసీల మద్దతును కూడగట్టి ప్రచారం చేస్తున్నారు. సిద్దిపేటకే చెందిన బడ్జెట్ పాఠశాలల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి సైతం ప్రైవేట్ పాఠశాలలతోపాటు ప్రభుత్వ ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. తన నెలవారీ వేతనం కూడా పేద విద్యార్థులకు ఇస్తానని చెబుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న రఘోత్తమరెడ్డి కూడా పోటీలోనే ఉన్నారు. గెలుపుపై ఆశలు పెట్టుకున్నారు.

ఎమ్మెల్సీ ఓటు ఇలా వేద్దాం..



కొండపాక, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. ఇప్పటికే ఓటర్లుగా నమోదు చేసుకున్న వారు ఓటు వేసేందుకు అర్హులు. సాధారణ ఎన్నికల్లో ఓటు వేయడానికి.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి తేడా ఉంటుంది. ఈ ఎన్నికల్లో ఓటు ఎలా వేయాలనేది కీలకం. ఈ విషయంలో అవగాహన కల్పించడం అధికారులు విఫలమయ్యారు. సరైన పద్ధతిలో ఓటు వేయకుంటే అది చెల్లకుండా పోయే ప్రమాదముంది. ఈ ఎన్నికల్లో మనకు నచ్చిన అభ్యర్థికి సరైన పద్ధతిలో ఓటు వేయడంతో పాటు అభ్యర్థులు నచ్చకపోతే నోటాపై ఓటు వేసే అవకాశమూ ఉంది. ఓటు ఎలా వేయాలో 'మీ కోసం..'

- ✦ ఇచ్చిన బ్యాలెట్ పేపర్ మీద అభ్యర్థుల పేర్లు, పార్టీ, అభ్యర్థి ఫోటో ఉంటాయి.
- ✦ మొదట ప్రాధాన్యం ఇచ్చే వారికి ఎదురుగా ఉన్న బాక్సులో 1వ నంబర్ వేయాలి.
- ✦ ఇతరులకు కూడా నచ్చిన ప్రాధాన్యత ఓటు కూడా వేయవచ్చు. అంటే ఇంకో అభ్యర్థికి కూడా ఓటు వేయాలనుకుంటే ఇప్పటికే 1వ ప్రాధాన్యత వినియోగించినందున ఈ అభ్యర్థికి రెండో ప్రాధాన్యం, మరో అభ్యర్థికి మూడో ప్రాధాన్యం ఇవ్వవచ్చు.
- ✦ పోలింగ్ కేంద్రాల్లో ఇచ్చే పెన్ మాత్రమే వాడాలి. సొంత పెన్ వాడకూడదు.
- ✦ ఓటు వేసేందుకు వెళ్లే సమయంలో గుర్తింపు కార్డులు తీసుకువెళ్లాలి. ఎన్నికల కమిషన్ నిర్ణయించిన గుర్తింపు కార్డులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి.
- ✦ పోలింగ్ బూత్‌లోనికి వెళ్లేముందు పేరు చూసుకుని సంతకం పెట్టాలి.
- ✦ బూత్ బయట ఓటర్ లిస్టులో పేరు క్రమసంఖ్య చూసుకోవాలి.

ఇలా చేయకూడదు..

- ☛ మీ సొంత పెన్ వాడకూడదు.
- ☛ అభ్యర్థులందరికీ ఒకటే ప్రాధాన్యత నంబర్ ఇవ్వకూడదు
- ☛ తెలుగులో ఒకటి అని రాయకూడదు. ఇంగ్లిష్‌లో కూడా వన్ అని రాయకూడదు. అంకెలోనే రాయాలి. ఉదాహరణకు 1
- ☛ బ్యాలెట్ పేపర్లో ఎక్కువ పేర్లు ఉంటాయి. ఆ పేర్లలో మీకు నచ్చిన వారికి 1వ నంబర్ వేయాలి.
- ☛ బ్యాలెట్ పేపర్ అక్కడి అధికారులు చెప్పే పద్ధతిలో మడత పెట్టి వేయాలి. లేదంటే మీ ఓటు ఇన్వాలిడ్ కింద లెక్క కడుతారు. ☛ ఖాళీగా పేపర్ వేయరాదు.
- ☛ మీరు ఇచ్చే నంబర్స్ గట్టిగా పెన్‌తో రుద్ద రాదు.
- ☛ అభ్యర్థి పేరు బాక్స్ పక్కన కాకుండా మరే ఇతర ప్రదేశాలలో ఓటు వేసినా ఓటు చెల్లదు.
- ☛ ఇచ్చిన బ్యాలెట్ పేపర్ నందు 1 ప్రాధాన్యత ఓటు వేయకుండా మిగతా నంబర్లు వేసినా ఓటు చెల్లదు.

పట్టభద్రుల పట్టం ఎవరికో?

పటాన్‌చెరులో 7,246 మంది ఓటర్లు

సంగారెడ్డి జిల్లాలో ఇక్కడే అధికం

పటాన్‌చెరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో అత్యధిక పట్టభద్రులు ఉన్న పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి నెలకొంది. ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఇక్కడి పట్టభద్రులు అవగాహన లేక పెద్దగా ఆసక్తి చూపకపోయినా, వారిని ప్రసన్నం చేసుకునేందుకు బరిలో ఉన్న అభ్యర్థులు తమ వంతు ప్రయత్నాలు చేశారు. అయితే, చాలా వరకు ఇక్కడి పట్టభద్రులకు అభ్యర్థులు ఎవరో కూడా తెలియకపోవడంతో వారు ఎవరికి పట్టం కడుతారో అన్నది ఆసక్తిగా మారింది.

7,246 మంది ఓటర్లు..

పటాన్‌చెరు నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది పట్టభద్రులు ఉంటారని సమాచారం. అయితే, ఇక్కడ ఓటర్లుగా కేవలం 7,246 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. అది కూడా నాయకులు పట్టభద్రులను గుర్తించి, పట్టుబట్టి వారితో నమోదు చేయించారు. అమీన్‌పూర్, తెల్లాపూర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం ప్రాంతాల్లోని వందల సంఖ్యల్లోని కాలనీలలో పెద్ద ఎత్తున పట్టభద్రులు ఉన్నారు. అయితే, వీరిలో చాలా మంది ఓటర్లుగా నమోదు చేయించుకునేందుకు ఆసక్తి చూపలేదు.

జోరుగా ప్రచారం..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు జోరుగా ప్రచారం చేశారు. ప్రధాన పార్టీల నాయకులు కాలనీల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. సోషల్‌మీడియా వేదికగా, ఎస్ఎంఎస్‌లు, ఫోన్లలో అభ్యర్థులు ఓటర్లను పలకరించారు. అధికార కాంగ్రెస్ నుంచి నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి పారిశ్రామిక వేత్త అంజిరెడ్డి, బీఎస్పీ నుంచి హరికృష్ణల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ఈ ముగ్గురిలో పట్టభద్రులు ఎవరికి పట్టం కడుతారో వేచి చూడాల్సిందే.

కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

● సదాశివపేట పట్టణ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ప్రచారం చేసిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



సదాశివపేటలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఓట్లను అభ్యర్థిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి, కాంగ్రెస్ నేతలు



సంగారెడ్డిలోని 23వ వార్డులో నరేందర్‌రెడ్డికి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్‌కుమార్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరిరోజైన మంగళవారం సదాశివపేట పట్టణంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ప్రచారం నిర్వహించారు. ప్రైవేటు కళాశాలల్లో లెక్చరర్లను కలిసి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి (సీరియల్ నెంబర్-2)కి ఓటువేసి గెలిపించాలని నిర్మలారెడ్డి కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కాగా సంగారెడ్డిలోని 23వ వార్డులో కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, పార్టీ సదాశివపేట మండల అధ్యక్షుడు సిద్ధన్న, పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు పిల్లోడి విశ్వనాథం, పట్నం సుభాష్, గుండురవి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

కోహీర్‌లో రెండు పోలింగ్ బూత్‌లు

కోహీర్, ఫిబ్రవరి 25: (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రమైన కోహీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు 590 మంది ఉండగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 58 మంది ఉన్నట్లు ఆయన తెలిపారు. పోలింగ్ బూత్ నంబరు 208లో ఉపాధ్యాయులు, పోలింగ్ బూత్ నంబరు 405లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్‌గా అంబదాస్ రాజేశ్వర్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్‌గా అంబదాస్ రాజేశ్వర్ నియమితులయ్యారు. సంగారెడ్డిలోని కార్యాలయంలో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్‌గా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో నారాయణఖేడ్, మెదక్ ఆర్డీవోలుగా అంబదాస్ రాజేశ్వర్ పనిచేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజేశ్వర్

న్యూస్ బాక్స్

మహాశివరాత్రి పోస్టర్ విడుదల

పటాన్‌చెరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు పట్టణంలోని మహదేవుడి ఆలయంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల పోస్టర్‌ను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మంగళవారం విడుదల చేశారు.

నేటి నుంచి శివాలయం, భద్రప్పస్వామి జాతర

కల్హేర్: మహాశివరాత్రి సందర్భంగా మండల కేంద్రమైన కల్హేర్‌లోని శివాలయం, భద్రప్పస్వామి ఆలయాల జాతర నేటి నుంచి మార్చి 1 వరకు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలతో పాటు సరిహద్దున ఉన్న మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు, మల్లయోధులు పాల్గొంటారని తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన ప్యాక్స్ డైరెక్టర్లు

కల్హేర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బీబీపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్) డైరెక్టర్లు అంజాగౌడ్, గొల్ల సాయిలు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి భూపాల్‌రెడ్డి తన స్వగ్రామమైన ఖానాపూర్(కె)లో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'క్రమశిక్షణతో చదువుకోవాలి'

నాగల్‌గిద్ద/కల్హేర్/చిలప్‌చెడ్/వెల్దుర్తి/నర్సాపూర్/వట్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమ శిక్షణతో, కష్టపడి చదువుకోవాలని మోర్గి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సువర్ణ అన్నారు. మంగళవారం పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అలాగే కల్హేర్ మండల పరిధి బీబీపేట ప్రాథమిక పాఠశాల, చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట ఉన్నత పాఠశాల, గౌతాపూర్ ప్రాథమిక పాఠశాల, వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్ ప్రాథమిక పాఠశాల, నర్సాపూర్ మండలం నాగులపల్లి ఎంపీపీఎస్ పాఠశాల, వట్‌పల్లి మండలం నాగులపల్లి ప్రాథమిక పాఠశాలలో కూడా స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు.

ఇష్టపడి చదివితే ఫలితాలు

అల్లాదుర్గం,ఫిబ్రవరి 25.(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇష్టపడి చదివితే చక్కటి ఫలితాలను సాధించొచ్చని ఎంఈవో ధనుంజయగౌడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తుక్కారాం, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి నర్సింహారెడ్డి, అధ్యాపకులు శ్యాంరావు, సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 24వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం వేడుకలను జరుపుకున్నారు.

దత్తగిరిలో రుద్రయజ్ఞం

ఝరాసంగం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలో గల దత్తగిరి ఆశ్రమంలో మంగళవారం ఆశ్రమ భావి పీఠాధిపతి డాక్టర్ సిద్ధయ్యస్వామి ఆధ్వర్యంలో రుద్రయజ్ఞాన్ని నిర్వహించారు.

9వ రోజుకు దీక్ష

నర్సాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : డంపుయార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం తొమ్మిదవరోజు చేరింది. స్థానిక విశ్వకర్మ మన్మయ సంఘం నిర్వహించిన దీక్షలో.. జిల్లా ప్రధాన కార్యదర్శి కృపాచారి, పట్టణ అధ్యక్షుడు నరేందర్ పాల్గొన్నారు.

'ఆస్తిపన్ను చెల్లించాలి'

రామచంద్రాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రజలు సకాలంలో ఆస్తిపన్నులు చెల్లించాలని కమిషనర్ సంగారెడ్డి కోరారు. మంగళవారం కొల్లూరులోని డబుల్ బెడ్‌రూంలలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటుచేసి ఆస్తిపన్నులు తీసుకున్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి ఇప్పటివరకు 2వేలకు పైగా ఇళ్ల అసెస్‌మెంట్ చేశామన్నారు. త్వరలో మిగిలిన ఇళ్ల పన్ను నిర్ధారణ పూర్తి చేస్తామన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఖేడ్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నిర్ధారిస్తే చికిత్సలు సులువు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు తాహేర్, మాజీ కౌన్సిలర్ హన్మాండ్లు, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, ఆవుటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఎమ్మెల్సీని ఎన్నుకోండి

● పట్టభద్రులను కోరిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



రామాయంపేటలో ఎమ్మెల్యే రోహిత్‌కు స్వాగతం పలికిన కాంగ్రెస్ నేతలు

రామాయంపేట/హవేళిఘణపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అనతికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎంతో పురోగతి సాధించిందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం రామాయంపేటలో సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి, సరాఫ్ యాదగిరి, ముత్యంరెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు యుగంధర్, అల్లాడి వెంకటిలు పాల్గొన్నారు. అలాగే హవేళిఘణపూర్ మండలం నాగాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరశురాంగౌడ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'జపాన్ సకుర'కు ఎంపికైన విద్యార్థినికి కలెక్టర్ ప్రశంస

● శాలువాతో సత్కారం, జ్ఞాపిక బహూకరణ ● గైడ్ టీచర్‌కూ అభినందన



స్రవంతిని సత్కరిస్తున్న కలెక్టర్ క్రాంతి

జోగిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్పైర్ సైన్స్‌ఫెయిర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన సంగారెడ్డి జిల్లా అందోలు మండలం కన్‌సాన్‌పల్లి పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థిని ఆశం స్రవంతిని కలెక్టర్ క్రాంతి వల్లూరు మంగళవారం అభినందించారు. స్రవంతి తన గైడ్ టీచర్ సిద్ధేశ్వర్ సూచనలతో... దివ్యాంగ విద్యార్థుల కోసం 'డెస్క్ లిఫ్టర్ ప్రాజెక్టు' రూపొందించింది. ఈ ప్రాజెక్టు ఇటీవల జాతీయస్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రదర్శించగా, ఉత్తమ అవార్డును గెలుచుకుంది. త్వరలో జపాన్ దేశంలో నిర్వహించనున్న 'సకుర' సైన్స్‌ఫెయిర్‌కు కూడా ఎంపికైంది. తెలంగాణ నుంచి ఎంపిక కాబడ్డ ప్రాజెక్టుల్లో డెస్క్‌లిఫ్టర్ మొదటిది కావడం గమనార్హం. మంగళవారం ఉదయం కలెక్టర్ వల్లూరు క్రాంతి తన కార్యాలయంలో స్రవంతిని, గైడ్ టీచర్ సిద్ధేశ్వర్‌ను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రెటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

సహజ సిద్ధమైన రంగులతో ప్రయోజనం: వరప్రసాద్



బహుమతులను ప్రదానం చేస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : సహజ సిద్ధమైన రంగులను వినియోగిస్తేనే ప్రయోజనం ఉంటుందని సీపియర్ సైంటిస్టు అండ్ హెడ్ వరప్రసాద్, గృహ విజ్ఞానశాస్త్రవేత్త హేమలత, రంగులపై పనిచేసే నిపుణులు శ్రీరామమూర్తి పేర్కొన్నారు. మంగళవారం దిడిగి శివారులోని డీడీఎస్-కేవీకేలో పలువురు మహిళలకు ఫ్యాబ్రిక్ ప్రింటింగ్‌పై నైపుణ్య శిక్షణ, సహజ సిద్ధమైన రంగుల తయారీ తదితరాలపై అవగాహన కల్పించారు. రంగుల తయారీ విధానం, ఏయే పువ్వుల వల్ల ఎలాంటి రంగులను తయారు చేయొచ్చో వివరించారు. అందులో భాగంగా నీలగిరిబెరడు, మోదుగ పువ్వు, రత్నజ్యోతి, ఖాచు, తంగేడుపువ్వు, ఆల్జీరీన్, కసీం బ్లాక్, ఉల్లిగడ్డ పొట్టు తదితరాలతో రంగులు తీసి ప్రింటింగ్ వేసే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు శైలజ, స్నేహలత, కైలాష్, స్వామి, మహిళలు పాల్గొన్నారు.



వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా ఆశ్రమం

సర్వమత సన్నిధి.. వెంకటఖ్వాజా ఆశ్రమం

● నేటి నుంచి జాతర ప్రారంభం

వట్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన వట్‌పల్లి వెంకటఖ్వాజా ఆశ్రమం(దర్గా) 39 ఆరాధన జాతర నేటి నుంచి ప్రారంభంకానున్నది. మూడురోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలకు రాష్ట్రానికి చెందిన భక్తులు కాకుండా ఇతర రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాదిమంది భక్తులు హాజరవుతారు. ఇందు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసింది. 26న గంధ సమర్పణ, అభిషేకం, పుష్పార్చన, 27న లక్ష దీపోత్సవం, త్రైకాన దర్శనం, 28న సమష్ట ఆరాధన, ఖురాన్ గ్రంథ పఠన, ప్రసాద వితరణ ఉంటుందని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.

కొప్పోల్ ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండలం కొప్పోల్ ఉమాసంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం నుంచి పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, అగ్ని ప్రతిష్ఠాపన, దుర్గాభవానికి అభిషేకం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు రాజశేఖర్‌రెడ్డి, సీతారామారావు, సంగమేశ్వర్, సతీష్‌గౌడ్, శంకరయ్య, పరమేశ్వర్‌రెడ్డి, పూజారులు సంగప్ప, మహేష్‌శర్మ పాల్గొన్నారు. ఎస్‌ఐ శంకర్ ఆధ్వర్యంలో జాతరకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

బీఆర్‌ఎస్ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలపై సన్నాహక సమావేశం

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాధన లక్ష్యంగా ఆవిర్భవించిన పార్టీకి 25 ఏళ్లు నిండిన సందర్భంగా జరుపనున్న సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు ప్రతి ఒక్కరిని సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందని సమావేశం అభిప్రాయపడింది. మంగళవారం రామచంద్రాపురంలో పటాన్‌చెరు నియోజకవర్గస్థాయి బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజలు పడుతున్న ఇబ్బందులపై నిత్యం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఏప్రిల్ 27 నాటికి 25 ఏళ్లు నిండిన సందర్భంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ సిల్వర్ జూబ్లీ వేడుకలు జరపాల్సి ఉంటుందన్నారు. రానున్న రెండునెలల్లో ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదర్శరెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో మెరుగైన సౌకర్యాలు

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి



గ్రంథాలయ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న సుహాసినిరెడ్డి

రేగోడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవాంం రేగోడు గ్రంథాలయ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. గ్రామపంచాయతీ కేటాయించిన స్థలంలోనే పనులు చేపట్టాలని సూచించారు. రేగోడు గ్రంథాలయ భవనానికి రూ.50 లక్షలతో సొంత భవనం వచ్చిందని, పనులు వేగవంతం చేయాలన్నారు. ఆమెవెంట గ్రంథాలయ సిబ్బంది నరేందర్‌రెడ్డి, శంకర్, యాదగిరి, రేగోడు లైబ్రేరియన్ సుజాత, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు భవాని ఉన్నారు.

శివరాత్రికి 31 ప్రత్యేక బస్సులు: డీఎం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి కోసం ఖేడ్ డిపో నుంచి ప్రత్యేకంగా 31 బస్సులను నడపనున్నామని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. మంగళవారం డిపో ఆవరణలో సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పెద్దశంకరంపేట సమీపంలోని కొప్పోల్ జాతర కోసం పెద్దశంకరంపేట నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఏడుపాయల వనదుర్గా జాతర కోసం బొడ్మట్‌పల్లి నుంచి ఏడుపాయలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డీఎం నర్సింలు, టీఐత్రీ నందులాల్, వెల్ఫేర్ కమిటీ సభ్యులు బీరయ్య, సంగీత, సూపర్‌వైజర్లు, కంట్రోలర్లు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దు: డీఎస్పీ

జహీరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో డివిజన్ వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 13 పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటుచేశామని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో డివిజన్ పరిధిలోని పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు అవసరమగు సిబ్బందిని కేటాయించామన్నారు. ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, 70 మంది పోలీసులు విధుల్లో పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో సీఐలు శివలింగం, హన్మంతు, ఎస్‌ఐలు కాశీనాథ్. నరేష్, రాజశేఖర్, సతీష్, సంగమేశ్వర్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

బాలమల్లయ్య మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటు

చేగుంట ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమం నుంచి నేటివరకు బీఆర్‌ఎస్‌లో ఉంటూ.. పార్టీకి సేవచేసిన ద్యానబోయిన బాలమల్లయ్య మృతిచెందడం బాధాకరమని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. మంగళవారం నార్సింగి మండలం జప్తిశివనూర్ గ్రామానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇందులో నార్సింగి మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నార్సింగి, చిన్నశంకరంపేట మండలాల అధ్యక్షులు మైలారం బాబు పాల్గొన్నారు.

'సమయపాలన పాటించకపోతే చర్యలు'

నర్సాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు కచ్చితంగా సమయపాలన పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని డీడబ్ల్యూవో హైమావతి హెచ్చరించారు. మంగళవారం నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. టీచర్లు ప్రతిరోజూ ఆన్‌లైన్ వర్క్ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీవో హేమభార్గవి, ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు సీజ్

రామాయంపేట/తూప్రాన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం రామాయంపేట, తూప్రాన్ మండలాల్లో మద్యం దుకాణాలను సీజ్ చేశారు. ఈరోజు నుంచి మూడురోజులపాటు ఎన్నికల కోడ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశానుసారం ఎక్సైజ్ పోలీసులు రామాయంపేట పట్టణంలోని మూడు వైన్స్‌లు, ఒక బార్‌ను, తూప్రాన్ పట్టణంలోని 5 మద్యం దుకాణాలు, బార్‌ను సీజ్ చేశారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు అన్ని మద్యం దుకాణాలు ఓపెన్ అవుతాయి.

కరాటే పోటీల్లో నస్కల్ విద్యార్థుల ప్రతిభ

నిజాంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్నేషనల్ షాలిన్ కుంగ్‌ఫూ కరాటే వారియర్స్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈనెల 23న సంగారెడ్డిలో జరిగిన టోర్నమెంట్‌లో మండలం నస్కల్ గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభచాటారు. ఈ పోటీల్లో ఆరు గోల్డ్‌మెడల్స్, 8 సిల్వర్ మెడల్స్, 3 బ్రౌన్ మెడల్స్ సాధించారు. గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్, హెల్ప్ ఆర్గనైజర్ పోచయ్య విద్యార్థులను అభినందించారు.

పోల్ చీటీలు గందరగోళం

● తూప్రాన్‌కు ఇతర జిల్లాల చీటీలు



తూప్రాన్‌కు వచ్చిన ఇతర జిల్లాల పోల్ చీటిలు

తూప్రాన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల పోల్ చీటీల గందరగోళం నెలకొన్నది. తూప్రాన్ పట్టణంలో పోల్ చీటీల పంపిణీ సక్రమంగా చేపట్టలేదు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో)లకు పోల్ చీటీల పంపిణీ బాధ్యతలు అప్పగించినప్పటికీ సక్రమంగా పంపిణీ చేయడం లేదు. రెవెన్యూ అధికారులు సైతం పోల్ చీటీల పంపిణీపై శ్రద్ధ చూపించడంలేదు. తూప్రాన్ మండలానికి ఇతర మండలాలు, ఇతర జిల్లాల పట్టభద్రుల పోల్ చీటీలు వచ్చాయి. తూప్రాన్ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రం 440 వేసి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం, సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం, మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌కు చెందిన పోల్ చీటీలు వచ్చాయి. తూప్రాన్ పట్టణంలో పోల్ చీటీలు సక్రమంగా పంపిణీ చేయకపోగా, ఇతర మండలాల చీటీలు కూడా ఇక్కడే వదిలేశారు.

మాకు జీతాలు ఇప్పించండి సార్

● గ్రామపంచాయతీ కార్మికుల ఆవేదన



చేర్యాల గ్రామపంచాయతీ కార్యాలయం

కంది, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : నాలుగు నెలలుగా తమకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కంది మండల పరిధిలోని చేర్యాల గ్రామంలో పంచాయతీ కార్మికులు మంగళవారం గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టారు. సమయానికి జీతాలు రాకపోవడంతో అప్పులు చేసి బతకడం కష్టమవుతుందని తెలిపారు. జ్వరం కానీ, ఇతర అనారోగ్య సమస్యలు వచ్చినా మందులు కొనుక్కునేందుకు కూడా డబ్బులు లేక నరకం చూస్తున్నామన్నారు. ఉదయం లేచిన దగ్గరి నుంచి గ్రామంలోని మురుగు కాలువల పూడికతీత మొదలు నర్సరీకి నీళ్లు పెట్టడం, గ్రామంలో నీటి సరఫరా, వైకుంఠధామాల శుభ్రత, గ్రామ పరిసరాల శుభ్రత తదితర పనులన్నీ తామే చేస్తామని వారు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమకు వేతనాలు ఇప్పించి, ఆదుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాత పద్ధతిలోనే రుసుం వసూలు చేయాలి



టోల్‌ప్లాజా మేనేజర్‌తో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

తూప్రాన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): టోల్‌ప్లాజాలో లోకల్ వాహనాలకు పాత పద్ధతిలోనే రుసుం వసూలు చేయాలని తూప్రాన్, మనోహరాబాద్ మండలాల వాహనదారుల అసోసియేషన్ డిమాండ్ చేసింది. మంగళవారం తూప్రాన్, మనోహరాబాద్ టిప్పర్, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో యజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో 44వ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా ఏర్పాటు చేశారు. టోల్‌ప్లాజా నిర్వహణతో పాటు, టోల్ రుసుం వసూలు చేసేందుకు నార్త్ తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌వేస్ ప్రైవేటు లిమిటెడ్ (ఎన్‌టీఈపీఎల్) టెండర్ పొందింది. ఇప్పటివరకు తూప్రాన్, మనోహరాబాద్ మండలాల స్థానిక టిప్పర్లకు నెలవారీగా రూ.1000 వసూలు చేశారు. ప్రస్తుతం టెండర్ పొందిన ఎన్‌టీఈపీఎల్ సంస్థ సైతం పాత పద్ధతిలోనే టోల్‌రుసుం వసూలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈవో వైఖరికి నిరసనగా జర్నలిస్టుల బైఠాయింపు

పాపన్నపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈవో చంద్రశేఖర్ వైఖరిని నిరసిస్తూ కలెక్టర్ ఎదుట జర్నలిస్టులు మంగళవారం బైఠాయించారు. 26 నుంచి ఏడుపాయల్లో జరుగనున్న మహాజాతరకు సంబంధించి, జిల్లా అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాలు జరిగినా తెలపడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్ ఎలాంటి సమస్యలు ఉన్నా మెదక్ ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లాని సూచించారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ఇకపై జర్నలిస్టులకు సమస్యలు రాకుండా చూస్తానని హామీఇవ్వడంతో నిరసన విరమించారు.